క్లుప్తంగా

రేపు సర్వ సభ్య సమావేశం

టంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అజిత తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

11న క్రికెట్ టోర్నమెంట్

పీసీపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చింతలచెర్వు సత్యనారాయణ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 11న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.8 వేలు అందజేస్తామన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.56 వేలు

సీఎస్‌పురం: మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ 56,327 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ.32,250, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.16,740, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.7,337 వచ్చినట్లు చెప్పారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీఎస్‌పురం: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని ఆర్‌కేపల్లి, కోవిలంపాడు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిదారులు, సంక్షేమ పథకాల కోసం నూతనంగా వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. ఉద్యోగులు సకాలంలో సచివాలయంలో హాజరు కావాలని, ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ హాజరువేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సింగరాయకొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు కలికవాయ ఫ్లెటైవర్ వద్ద సోమవారం సీజ్ చేశారు. సెబ్ ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం.. పాలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మహేంద్రను అదుపులోకి తీసుకున్నారు. మొదటి తప్పుగా భావించి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు అభినందన



ఏఎంసీ డైరెక్టర్ రసూల్‌బీని సత్కరిస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: కొండపి ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులైన పొన్నలూరు మండలం కె.అగ్రహారం గ్రామానికి చెందిన ఎస్‌కే రసూల్‌బీని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సోమవారం అభినందించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ.. నూతన ఏఎంసీ కమిటీ సభ్యులు రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి దోహదపడాలన్నారు. రసూల్‌బీ మాట్లాడుతూ.. తనకు పదవి రావడానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వరికూటి అశోక్‌బాబు, మండల పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఎస్‌కే చిన్నమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల వికాసం ప్రభుత్వ లక్ష్యం

- బస్సులను జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: బడుగు, బలహీన వర్గాల వికాసం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం జగనన్న బడుగుల వికాసం కింద ఎస్‌సి, ఎస్‌టీలకు చెందిన ఐదు ఆర్టీసీ అద్దె బస్సులను పీవీఆర్ పాఠశాల వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ బస్సులు ఆర్టీసీ ఆధ్వర్యంలో వివిధ రూట్లలో తిరుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న బడుగుల వికాసం కార్యక్రమాన్ని ఎస్‌సీ, ఎస్‌టీలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఐదు బస్సులకు సంబంధించి ఎస్‌బీఐ ఒంగోలు రీజయన్ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల మేరకు రుణం మంజూరు చేసిందన్నారు. దీనిలో పరిశ్రమల శాఖ జీఎం మధుసూదన్‌రెడ్డి, ఎల్‌డీఎం యుగంధర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్లు ప్రసాద్, ఆనంద్, సురేష్, డిప్యూటీ మేనేజర్ పీబీ చంద్రశేఖర్, డిక్కీ ప్రతినిధులు వి.భక్తవత్సలం, ఆశీర్వాదం, హరి, బస్సుల యజమానులు దాసరి అమీరా, పి.సాల్మాన్‌రాజు, నిఖిల్, జాన్ వెస్లీ పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకం

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమం
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకమైందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసుకుని నాలుగేళ్లు అయిన సందర్భంగా సోమవారం స్థానిక చెక్ పోస్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పక్షనేతగా ఉన్నప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా సుదీర్ఘంగా 134 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,516 గ్రామాల్లో పర్యటించి, 3,648 కిలో మీటర్ల పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో ఆనందాలు విరజిల్లేలా చేస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సు పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చేతుల మీదుగా రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ వైఎం సరితాప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి.సుజాత, సీహెచ్ సాల్మన్, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఎస్‌కే జిలానీ, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



పొగాకు తోటలను పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు వీలైనంతవరకు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, జీవ సంబంధ పురుగు మందులు వాడాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. సోమవాసం టంగుటూరు వేలం కేంద్రం పరిధిలోని తూర్పునాయుడుపాలెంలో పొగాకు రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పొగాకు తోటలో తల తుంచి పిలక మందు వాడటం వల్ల వచ్చే లాభాలు, వివిధ రకాల శిలీంద్ర నాశినులు, తెగుళ్ల నివారణ, మేలైన నారు ఎంపిక, బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా చూడటంపై అవగాహన కల్పించారు. సిఫారసు చేసిన పురుగు మందులను తగిన మోతాదులో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. పురుగు మందు అవశేషాలు మోతాదుకు మించి వస్తే రూ.5000 అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న రైతులకు రైతు సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు వడ్డీ లేని రుణం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్జీఓ సునీల్‌కుమార్, క్షేత్రాధికారి వెంకట్రావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

లింగసముద్రం: మండలంలోని విశ్వనాథపురంలో మంగళవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రసేన్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండల స్థాయి అధికారులు వారి వద్ద ఉన్న సమాచారంతో హాజరు కావాలని కోరారు. అలాగే మధ్యాహ్నం స్థానిక వేముల అంజయ్య కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

39 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

గుడ్లూరు: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణలను వైద్యాధికారి సాయి ప్రసన్న వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ గ్రామాలు నుంచి వచ్చిన 39 మంది గర్భిణులు పరీక్షలు చేసి రక్త హీనత తక్కువగా ఉన్న వారికి ఐరన్ మాత్రలు అందచేశారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



రాళ్లపాడులో పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

గుడ్లూరు: మండలంలోని రాళ్లపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా ఏపీడీ సంజీవరావు సోమవారం తనిఖీ చేశారు. కూలీలకు చెందిన మస్టర్లను, పంటకాలువ పనులను పరిశీలించారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేయిస్తున్నామన్నారు. పంట కాలువల్లో పూడికతీత పనులు వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాళ్లపాడులో ప్రస్తుతం 65 మంది కూలీలు పంటకాలువల పనులు చేస్తున్నారన్నారు. పోట్లూరు చెరువులో జరుగుతున్న పనులను ఏపీఓ వినయ్ పరిశీలించారు. ఏపీడీ వెంట టీఏ హరినారాయణ, ఫీల్డు అసిస్టెంట్ రాజు ఉన్నారు.

స్పందనకు 25 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కందుకూరు అర్బన్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 25 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎస్.మనోహన్ తెలిపారు. ఒకటో వార్డు సచివాలయం పరిధిలోని సాయి నగర్‌లో సైడు కాలువలు నిర్మించాలని, పెన్షన్లు మంజూరు చేయాలని, పెన్షన్‌ను పునరుద్ధరించాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కమిషనర్‌కు అర్జీలు అందేశారు.

రాష్ట్రానికి పట్టిన ఖర్మ చంద్రబాబు



పొన్నలూరులో కేక్ కట్ చేస్తున్న అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

పొన్నలూరు: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు పట్టిన ఖర్మ అని వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పొన్నలూరు బస్టాండ్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ.. టీడీపీ జమానాలో రాష్ట్ర ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారన్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3648 కి.మీ మహాపాదయాత్ర చేపట్టి ప్రజలకు మనోధైర్యం కల్పించారన్నారు. పాదయాత్రలో గుర్తించి 22 ప్రధాన అంశాలను నవరత్న, సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందిస్తూ వారి జీవన స్థితిగతులను మార్చి వేశారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి నాలుగేళ్లుగా పక్కా ప్రణాళికలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇంకా మెరుగైన పాలన అందించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అధికార యంత్రంగాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సరికొత్త సంక్షేమ పథకాలు చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే చంద్రబాబు తన ఉనికి కోసం పవన్ కళ్యాణ్‌తో కలిసి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేష్టలను ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టి మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, కంచర్ల రవణయ్య, పల్లపోలు బాలకోటిరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, దాసరి రవి, నవులూరి మధు, ముప్పా కోటేశ్వరరావు, చేవూరి పద్మనాభరెడ్డి, పెరుగు కోటేశ్వరరావు, వంగపాటి రామకృష్ణ, ఎస్‌కే చినమస్తాన్, కూనం బ్రహ్మారెడ్డి, అనుమోలు శివయ్య, గొర్రెపాటి మహేష్, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, మాల్యాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరకాలం గుర్తుండిపోయే పాదయాత్ర



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్ర చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. కందుకూరు మండల, పట్టణ వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశం సోమవారం స్థానిక వెంగమాంబ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. నేటి పాలనకు ఆ పాదయాత్రే ఆదర్శమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కొమ్మూరి కనకారావుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

62 మందికి వైద్య పరీక్షలు



దాసరిపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్‌కుమార్

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా సోమవారం దాసరిపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో 62 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు, సుగర్, బీపీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సందీప్‌కుమార్, ఏఎన్ఎం వింధ్యారాణి, నాగరాజు, 104 వాహన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: ప్రతి ఇంటికే వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్యం ఉపకేంద్రం డాక్టర్ ఈద మణిదీపిక అన్నారు. మండలంలోని కలవళ్ల సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సోమవారం ప్రారంభించారు. డాక్టర్ మణిదీపిక ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, ఎటువంటి ఆహారం పెడుతున్నారో అడిగి తెలుసుకున్నారు.

స్థలం కేటాయించాలని వినతి

పొదిలి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ స్థాపనకు స్థలం కేటాయించాలని స్థానిక నేతపాలెం వాసులు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ భాగ్యలక్ష్మి, కమిషనర్ జోషెఫ్ దానియేల్‌ను కలిసి వినతిపత్రాలు అందచేశారు. సర్వే నంబర్ 852లోని ఖాళీ స్థలం విగ్రహ స్థాపనకు అనువుగా ఉంటుందని, సదరు ఖాళీ స్థలాన్ని అధికారులు పరిశీలించి, కేటాయించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ధర్నాసి పెద్దన్న, బండి అశోక్, ఆరిక రాము, రాజు, హజరత్, వడ్డే వేణు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నళినీదేవి

కందుకూరు: చంద్రబాబునాయుడు బహిరంగ సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలకు రామయ్య ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్, భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు ఉన్నం నళినీదేవి ఆర్థికం సాయం అందించారు. 8 మంది మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ.25 వేల చొప్పున అందజేశారు.

రేపు కన్వీనర్ల సమావేశం

ఉలవపాడు: మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ సచివాలయ గ్రామ, వార్డు కన్వీనర్ల సమావేశం బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్రప్రచార కమిటీ సభ్యుడు రామాల శింగారెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

విద్యా, వైద్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం



గర్భిణులకు పండ్లు, చీర, జాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైద్యాధికారిణి కీర్తిశ్రీ

- ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: రాష్ట్రంలో విద్యా, వైద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కాకర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు నాడు-నేడు పథకం కింద కాకర్ల వైద్యశాల ప్రాంగణంలో రూ.1.70 కోట్లు మంజూరు చేసి, శాశ్వత భవనం నిర్మించారన్నారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు చేయించుకున్న మహిళలకు ప్రభుత్వం రూ.5 వేలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే బలవర్థక ఆహారాన్ని గర్భిణులు సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు. సామూహిక శ్రీమంతాలు చేసి, పండ్లు, చీర, జాకిట్‌లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పీ కీర్తిశ్రీ, హెచ్ఈఓ ఏడుకొండలు, పీహెచ్ఎన్ అన్నమ్మ, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు మాచేపల్లి నాగయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దండు కట్టి దుష్టశక్తులను తిప్పికొడదాం

- గృహ సారథులకు రానున్న రోజుల్లో మంచి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: గృహ సారధులకు రానున్న రోజుల్లో పార్టీ మంచి గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తోందని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి అధ్యక్షతన ప్రజా ప్రతినిధుల, కన్వీనర్ల, నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ గృహ సారథులు క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని గురించి వివరించాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో కేవలం పచ్చ చొక్కాల వారికే జన్మభూమి కమిటీలు పథకాలు ఇచ్చే వారని, నేడు ఆ పరిస్థితి లేదని వివరించాలన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఇదే ఆదాయం ఉండేదని.. కానీ ఇన్ని సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేదని టీడీపీ నాయకులను ప్రశ్నించాలన్నారు. టీడీపీ పాలనంతా దోచుకోవడం దాచుకోవడమేనన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని ప్రజలకు వివరించాలని చెప్పారు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ముసుగు తీశారు..

చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు ముసుగు తీశారు.. దుష్టశక్తులను ఎదుర్కొనేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా దండు కట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దుష్ట చతుష్టయం చేసే కుట్రలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా సిద్ధం కావాలన్నారు. తాను కార్యకర్త స్థాయి నుంచే వచ్చాను.. మీ అందరికీ నేను ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. భవిష్యత్ అంతా కార్యకర్తలదేనన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, ఎంపీపీ అత్యాల జఫన్య, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, చెరుకూరి సతీష్ చౌదరి, వైస్ ఎంపీపీలు తిరుపతిరెడ్డి, జి.ధనుంజయ్, పార్టీ మండల కన్వీనర్ జి.బొర్రారెడ్డి, మూలే మాలకొండారెడ్డి, ఎస్‌కే రహీం, కరీం, సిద్ధారెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు ఫాతిమా సేవలు ఎనలేనివి



ఫాతిమా చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పామూరు: మహిళల విద్యకు ఫాతిమాసేవలు ఎనలేనివని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంఘాల నాయకులు షేక్.నాయబ్‌రసూల్, వైఎస్సార్‌సీపీ, ప్రజాసంఘాల నాయకులు షేక్.నాయబ్‌రసూల్‌లు అన్నారు. స్థానిక స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ కార్యాలయంలో సోమవారం ఆధునిక భారత తొలి మహిళా ముస్లిం ఉపాధ్యాయిని షేక్.ఫాతిమా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలను నివాళులర్పించారు. పూలే దంపతులకు ఆశ్రయం ఇచ్చి ఆదుకోవడమేకాకుండా తానుకూడా లౌకిక విద్యను నేర్చుకుని సావిత్రిబాయితోకలిసి విద్యాబోధన చేసి తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయిని ఫాతిమా అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.బాలసిద్ధయ్య, ఎంఏటీ నాయబ, శ్రీరాం శ్రీను, జిలాని, కోడిగుంపల నాయబ్ రసూల్, రఫీ, కందుల వెంకటనారాయణ పాల్గొన్నారు.

కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సీఎస్‌పురం: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి మంచి పేరు తీసుకురావాలని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాల సెక్రటరీ కదిరి పార్థసారధి అన్నారు. రాష్ట్ర స్థాయి ఉద్యాన వన కళాశాలల క్రీడా పోటీల్లో కదిరి బాబూరావ ఉద్యాన వన కళాశాల విద్యార్థి కె.కృప షటిల్ బ్యాట్మింటన్‌లో మొదటిస్థానం, జి.పావని 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపించిన విద్యార్థుల అభినందన సభ సోమవారం శీలంవారిపల్లి కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలలో నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులతో పాటు, వివిధ విభాగాలలో ప్రతిభ చూపించిన బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, చైర్మన్ కేవీ ప్రకాశరావు, సెక్రటరీ కదిరి పార్ధసారధి, కళాశాల డీన్ పి.వీరన్నగౌడ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.